# పరీక్షపేపర్ల దొంగలు

"మాష్టారూ...అయ్యగారు అర్జంటుగా మిమ్మల్ని పిలుచుకొని రమ్మన్నారండి" అని చెపుతూ, చేతులు పిసుక్కొంటూ నమ్రంగా నిలబడిన బంట్రోతు సూరన్న కేసి చూచి, మనసులో "ఏ మొచ్చిపడిందో, వారం రోజుల క్రితమే నేను స్కూల్లో చేరింది; నాతో యీ రాత్రి ఎనిమిది గంటలప్పుడు యేం పనో; ఉదయం యెలాగైనా స్కూలుకు వెళ్ళుతానుగా!...... జరుగురైన పనేమిటో కనుక్కోవాలి" అనే కుతూహాలంతో బయలుదేరాడు మోహానరంగం.

మోహానరంగం రాగానే, డ్రాయింగ్ రూమ్‌లో పేముకుర్చీలో కూర్చోమని, ఎదురుగావున్న రోజ్‌వుడ్ కుర్చీలో ఆసీనుడయ్యాడు హెడ్మాష్టర్ శ్రీధర్.

"ఎలా వుందండి మీ కీవూరి వాతావరణం, అదీను? స్కూల్లో అంతా బాగుందా?" అని ఆప్యాయంగా అడిగాడు శ్రీధర్.

"ఊరికే ముందండి? అన్ని విధాలా సదుపాయంగానే వుంది. స్కూల్లో పిల్లలు కొంచెం రౌడీ మూకలాగున్నారు. నిన్న ఒక అబ్బాయి 'సైన్సుపేపర్ తయారు చేసి యిచ్చేశారా సార్?' అని బహిరంగంగా క్లాస్‌లోనే అడిగేశాడు. పిల్లల ప్రవర్తన మాత్రం కొంచెం విచ్చలవిడిగా వున్నట్లు వుందండి" అంటూ నసుగుతూ చెప్పాడు సైన్సు మాస్టారు మోహానరంగం.

"పిల్లల పోకిరీతనాన్ని ఇట్టే తెలుసుకొన్నారే! మీలో పరిశీలనాశక్తి, కార్యదీక్ష వుందని గ్రహించే మిమ్మల్ని పిలిపించా" నన్నాడు శ్రీధర్.

"నా పరిశీలనాశక్తికీ, యీ పిలుపుకు సంబంధం యేమిటండీ.?" అని సూటిగా ఆత్రంతో అడిగాడు మోహానరంగం.

"వస్తున్నా, అసలు విషయంలోకి. మీకు తెలిసే వుండొచ్చు, మన పాఠశాలలో గడచిన సంవత్సరాలలో వార్షిక పరీక్ష ప్రశ్నాపత్రాలు తప్పకుండా బట్టబయలయిపోతున్నాయని. రెండేళ్ళ క్రితం ప్రశ్నాపత్రాలు బహిరంగమైనందుకు మనమిషన్ వారి ప్రెస్ ఫోర్‌మెన్ కారణమని అతన్ని వుద్యోగం నుండి బర్తరఫుచేశాము. గత సంవత్సరం, మేమంతా తర్కించి, తర్కించి, ప్రశ్నాపత్రాలను మద్రాసులో ఒక ప్రవేట్ ముద్రాక్షరశాలలో ముద్రణకిచ్చాము. పరీక్షలు వారం రోజులున్నాయనగా నేనే స్వయంగా ఒకరోజు రాత్రికి రాత్రి కార్లో వెళ్ళి, ప్రెస్ యజమానికి ప్రత్యేకమైన సలహాలిస్తూ, క్వొశ్చన్ పేపర్ల ప్యాకెట్టులను అందిస్తూ, అతిరహస్యంగా పేపర్లను ముద్రింప చేయమని కోరాను. "అతి రహస్యం బట్టబయలు" అన్నట్లు, గత సంవత్సరంకూడ పేపర్లు బయటపడ్డాయి. రహస్యం ఎలా బయటికి పొక్కిందని అందరం ఆశ్చర్యపడ్డాము. పట్టుమని యిక పదిరోజులు లేవు పరీక్షలు. దగ్గిరకొస్తుంటే నాకు ఆందోళన యెక్కువౌతోంది. ఎలాగైనా యీ మారు ప్రశ్నాపత్రాలను గుట్టుగా వుంచాలని, బయటపడకుండా వుండేలా చూడాలని నా ఆశయం. నేను యోచించి, యీ విషయం గూర్చి చర్చించుటకూ, దీనిని సమగ్రంగా పరిశీలించి ప్రశ్నాపత్రాలు వెల్లడి కాకుండా అరికట్టే మార్గం కనుగొనేందుకు ఒక సలహా సంఘాన్ని నియమించాను. మిమ్మల్నికూడ సభ్యుల జాబితాలో చేర్చాను. రేపు సాయంత్రం అయిదు గంటలకు యిక్కడే మా ఇంట్లో చర్చలు జరుపుదాం. తప్పకుండా మీరు హాజరు కావాలి. ఈ సభ గూర్చి కూడ గుప్తంగా వుంచాలి. ఇది చెప్పేందుకే మిమ్మల్ని పిలిపించాను. మీరింక వెళ్లొచ్చు"నని పెద్ద వుపన్యాస మిచ్చాడు శ్రీధర్.

"అలాగేనండి" అంటూ సెలవు

పుచ్చుకొని వెళ్లిపోయాడు మోహన రంగం.


మర్నాడు సలహా సంఘం సభ. సభ్యులయిన మోహనరంగం, డ్రిల్ మాష్టర్ చిట్టిబాబు, లెక్కల మాష్టారు జేకబ్ హాజరయ్యారు. కార్యక్రమం కాఫీతో ప్రారంభ మయింది. తర్వాత అసలు చర్చల లోకి దిగారు. చిట్టిబాబూ, జేకబ్ యేవో సలహా లిచ్చారు. శ్రీధర్‌కి అవేమీ అంతగా నచ్చలే. తర్వాత మోహనరంగం, యోచించి వుంచిన పథకాన్ని వివరించాడు.

“నేను ఆచూకీ తీసినంతవరకు, ప్రశ్నాపత్రాలను మాష్టర్లుగాని, ప్రెస్‌వాళ్లుగాని బహిరంగపఱచడం లేదు. క్వొశ్చన్ పేపర్లను దొంగిలించడం ద్వారా అవి పిల్లలలో వెల్లడి అవుతోంది. దాన్ని అరికట్టడానికి నేనొక మార్గాన్ని కనిపెట్టాను. ఆ యా సబ్జక్టులలో పేపర్లు పరీక్షకు ముందురోజు సాయంత్రమే తయారు చేయించి, మన డూప్లికేటర్ మిషన్ ద్వారా, పరీక్షకు అరగంట ముందుగా కావలసిన ప్రతులను తీయించి, పరీక్షల్ని నిర్వహిస్తే, బయటపడడానికి వీలుండ”దని ముక్తసరిగా ముగించాడు.

సంఘసభ్యులంతా యీ మార్గానికి ఏకగ్రీవంగా ఒప్పుకొన్నారు. శ్రీధర్ కూడ మోహనరంగం సలహాను మెచ్చుకొన్నాడు.

* * *

మోహనరంగమే రంగంలోకి దిగి తనే డూప్లికేటర్‌ను ఆపరేట్ చేస్తూ, రహస్యంగా హెడ్మాష్టర్ గదిలో, ప్రతులనుతీసి, మొదటిరోజు ప్రశ్నాపత్రాలని గదులలోని వాచర్లకు అందించాడు.



“ముద్దులొలికే పాప”
పోడూరి దివ్యప్రభాకర్, విశాఖపట్నం.

అదేమి కర్మమో కాని, ఫోర్త్ ఫారం ప్రశ్నాపత్రం బయటపడింది ఆ రోజు. పరీక్ష ప్రారంభమైన పది నిముషాల్లో, కాపీకొడుతుంటే పట్టుబడిన అయిదుగురు విద్యార్థుల దగ్గర దొరికిన మడిచిన స్లిప్పులలో పేపర్లోని ప్రశ్నలకు వరుసగా జవాబులు వ్రాయబడి వుండడం దీనికినిదర్శనం.

రెండోరోజుకూడ పేపర్లు తెలిసిపోయాయ్. ముందురోజుసాయంత్రం హెడ్మాష్టర్‌తో తను తప్పక డిటెక్టు చేస్తానని కోసిన కోతలు ఫలించలేదని మోహనరంగం మొహం ముడుచుకొన్నాడు. అయితే “పట్టు పట్టానంటే అంతు తేలేంతవఱకు నిద్రపో”నన్నాడు మళ్ళీ యీరోజు.

* * *

మూడోరోజు వుదయం ఏడు గంటలకు మురళిని, గోవిందరావును, పాఠశాల బంట్రోతు సూరన్నను పోలీస్‌స్టేషన్‌కి తీసుకువెళ్తూండగా, పాఠశాల ఆవరణ ప్రాంతంలో చేరిన ప్రజలు మోహనరంగం మాష్టారి పట్టుదలను, పరిశోధనాశక్తినిగూర్చి, పొగడుతున్నారే గాని, విద్యార్థులు చేసిన చెడ్డపనిగూర్చి అంతగా అనుకోవడం లేదు.

పోలీస్‌స్టేషన్లో హెడ్మాష్టర్, పాఠశాల మాష్టర్లు, పురప్రముఖుల సమక్షంలో, సబ్ఇన్‌స్పెక్టర్ మోహనరంగాన్ని, ఈ దొంగతనాన్ని యెలా కనిపెట్టారని ప్రశ్నించగా, మోహనరంగం నవ్వుతూ యిలా చెప్పుకు పోయాడు: “ఇది చాల సులువైన కేసు. నేను విద్యార్థులే చేతులు కలిపి పేపర్లను సంగ్రహిస్తున్నారని గ్రహించాను. మొట్ట మొదటిరోజు పేపర్ బయటపడింది. ఆరోజు రాత్రే స్కూలు పైమేడ డాబానుండి ఎనిమిది గంటలనుండి రాత్రంతా కాపలా కాచాను. ఎవరూ స్కూలు ఆవరణంలోకి అడుగుపెట్ట లేదు. రెండో రోజు పేపరు బయటపడడం ఆశ్చర్యమైంది. తార్కికంగా యోచిస్తే, ముందు రోజు సాయంత్రం అయిదు గంటలకు సెట్ చేసి, గాడ్రెజ్ బీరువాలో వుంచిన, కవరులోని వ్రాత ప్రతిలోనే కీలకం వుందని, నిర్ణయానికొచ్చాను. నిన్న హెడ్మాష్టారితో చెప్పి, సూరన్నకు కూడా తెలియకుండా హెడ్‌మాష్టారి గదిలో కత్తి బీరువా వెనుక నక్కి కూర్చొన్నాను. చీకటిపడగానే, ఆరుగంటలప్పుడు గది యెడమవైపు నుండే తలుపు తోసుకొని గోవిందరావు, మురళీ వచ్చారు. టార్చిలైట్ వేసి డూప్లికేట్ తాళాలతో గాడ్రెజ్ కప్ బోర్డును తెరిచారు. ప్రశ్నాపత్రాన్నితీసి చదివి రాసుకొంటున్నప్పుడు, నాకు ప్రత్యక్షంగా పట్టుబడ్డారు. బంట్రోతు సూరన్న గాడ్రెజ్ బీరువాతాళం హెడ్మాష్టారి డ్రాయర్‌లోని డూప్లికేట్

## పరీక్షాపత్రాల దొంగలు

కాగితం చేతుల గుత్తిలోంచితీసి వీళ్లకి యివ్వడం, గది ప్రక్క తలుపు గడియవేయకుండా మూసి వుంచడం వీరి దొంగతనానికి దోహద మిచ్చాయి."

సబ్ యిన్‌స్పెక్టర్ "సూరన్నే దొంగతనానికి మార్గాన్ని చూపి, ప్రోత్సహించాడే!" నని చెపుతూ, అతన్ని లాకప్‌లోకి ఒక తోపు తోసి, మోహనరంగానికి గట్టిగా షేక్‌హాండ్ యిస్తూ, "అద్భుతమైన డిటెక్షన్"అని మెచ్చుకొన్నాడు. ★




## జీవితం-చదువు

(11 వ పేజీ తరువాయి)

పతితలనుంచి ఏవిధమైన రెస్పాన్స్ వస్తుందో చూడవచ్చు.

"ఏమండోయ్ ఎందాకా వచ్చిందికథ?"

రామాయణంలో పిడికలవేట అంటే ఇదే! మంచి రసవత్తరఘట్టంలో చచ్చుప్రశ్నలో ప్రవేశించింది శ్రీమతి.

"ఒక్క అయిదునిముషాలు ఆగు. ఆఖరు ఘట్టంలోకి వచ్చాను."

"అప్పుడే ఆఖరుఘట్టంలోకి వచ్చారా?- ఇవ్వాళ్లా పట్టుందన్నారు మరి?"-ఆశ్చర్య పోయింది.

"కొంచెంఆగుదేవీ! నన్ను మాట్లాడించకు" విసుక్కున్నాను.

మొహం కందగడ్డ చేసుకుంది. సూర్యాస్తమయానంతరం ఆకాశం సంధ్యారాగం పులుముకున్నట్లు. ముక్కులో నే తుంచాలి గాని మానయిన తర్వాత నరుకుదామంటే నరాలు తెగుతాయ్. రూపాయి వడ్డీమీద అనురాగం అప్పు తెచ్చుకుని వినవిసా ఇంట్లోకి పోయిన శ్రీమతిని కేకేశాను.

వచ్చింది. దగ్గరకురాలేదు. అల్లంత దూరాన గది గడపదగ్గర నిల్చున్నది 'ఏమిటా' అన్నట్లు. దేవి ప్రసన్నంకోసం అభిమానం తాకట్టుపెట్టి ఆప్యాయత తెచ్చుకున్నాను గొంతులోకి.

"అంతకోపమయితే ఎట్లా చెప్పు?"

శ్రీమతి మొహాన తారాడుతున్న సాంధ్య మేఘాలు విడిపోయి, చంద్రోదయమయింది. నల్లని కళ్ళలో పున్నమివెన్నెల ప్రతిబింబించింది. తెల్లని పలువరుస తళుక్కుమంది. నడిచివచ్చింది నవ్వులగవ్వలు ఘల్లుమనిపించు కుంటూ టేబుల్‌మీది కాగితాలు పేజీల వారీగా సర్దుతూ—

"అయిదునిమిషాల్లోఅయిపోతుందన్నారు కాబట్టి — ఇప్పుడెంతయింది, పదికొం డేగా—పన్నెండున్నరకు 'సరస్వతీ'కి పోదాం. మంచి క్రైమ్‌పిక్చర్ —'హంతకుడు' ఏమంటారు? మాట్లాడరేం?"

పక్కింటివారిఅమ్మాయి పార్వతి ఎప్పుడు కొట్టిందో దాలిగుంటలోంచి పారిపోయిన కుక్క తిరిగి అక్కడికే చేరుతున్నది.

నాకు నవ్వువచ్చింది. ఇంకా దిగులుపడుతున్నాను, శ్రీమతి నా కాలాన్ని వృధా చేస్తున్నదేమోనని. అంత్యఘట్టంగురించి ఇక ఆలోచించాల్సిన అవసరంలేదు. రెండు నిమిషాల్లో వ్రాసేయగలను. శ్రీమతి నుంచి 'మేటర్' బాగా అందింది. కొందరు కోరకుండానే, తమకు తెలియకుండానే సహాయం చేస్తారు.

"త్వరగా ఆ మిగిలింది కాస్తా వ్రాసేసుకోండి! శుభస్యశీఘ్రం అన్నారు పెద్దలు"

"అవశ్యం..." ★

## అమెరికన్ నటీనటులు

(6 వ పేజీ తరువాయి)

విశ్వవిద్యాలయ బృందంవారు నాటక ప్రదర్శనవల్లనైతేనేం, వారి ప్రవర్తనవల్లనైతేనేమి హైదరాబాదు పౌరుల హృదయాలలో ఒక స్థానం సంపాదించుకొన్నారు. తమ స్నేహభావానికి చిహ్నంగా భారతీయ నాట్యసంఘం (ఆంధ్రప్రదేశ్ శాఖ) నటరాజు చిత్తరువు నొకటి వారికి బహూకరించింది.

అమెరికానుంచి చౌకగాదిగుమతి అయ్యే చౌకబారు భూతద్దాలకు బదులు, ఇటువంటి కళాకారుల బృందాలను తరుచు భారతదేశానికి పర్యటనార్థం రప్పించగలిగితే, అమెరికా భారతదేశాలమధ్య కరుడుగట్టిన విభేదాలు కరిగిపోతాయి కనీసం సాంస్కృతిక రంగంలో.

తుదిని ఒక్కమాట: ఈ కార్యక్రమ పరంపరతో ఆంధ్రప్రదేశ్‌లో థియేటర్ సెంటర్ చక్కగా పనిచేస్తుందన్న సంగతి వెల్లడిఐంది. నిర్వాహకులు, సహృదయులు, అనేకవిధాల సమర్థవంతులు. కాని ప్రచార సాధనాల విలువను వీరు పూర్తిగా గ్రహించి నట్టులేదు. సికిందరాబాదు త్యాగరాజ గానసభవారు త్యాగరాజువలె నేనిష్కాములు. వారికి ప్రచారం అవసరంలేదు. ప్రచారం ప్రమాదకరమని భావించే సంస్థలు కూడా నగరంలో లేకపోలేదు. అటువంటి సంస్థలపైనే పత్రికలు ఎక్కువ దృష్టిబరపడం తమ బాధ్యతగా స్వీకరిస్తాయి. భారతీయ నాట్య సంఘం అటువంటి సంస్థకాదు. అది చేస్తూన్న ప్రయోజనాత్మకమైన కృషి ప్రజలకు తెలియాలంటే నిర్వాహకులు ప్రచారసాధనాల ఆవశ్యకతను గుర్తించడం అవసరం. ★